# అద్దంలో హరివిల్లు



ఇచ్ఛాపురపు జగన్నాథరావు

"నమస్కారం సార్! గుడ్ మార్నింగ్!"

శంకర్ తలఊపి, అతన్ని కూర్చోమని చేత్తోనే సైగచేసి కుర్చీలో వెనక్కి జారబడి కూర్చుని సిగరెట్ వెలిగించి కొన్ని క్షణాలు అతన్ని పరిశీలనగా చూసి, "యస్?" అన్నాడు.

"నా పేరు చలపతి సార్!" అన్నాడు ఇబ్బందిగా కుర్చీలో కూర్చున్న యువకుడు. అతను కుర్చీ అంచుకి కూర్చున్నాడు. చేతిలో చిన్న ప్లాస్టిక్ సంచీ. అందులో ఏముంటాయో చలపతికి తెలుసును. కాగితాలు.

శంకర్ తల ఊపేడు.

"మాది బెజవాడ అండీ! ఆరేళ్ల కిందట బి.ఏ. పాసయాను."

"అలాగా!" అన్నాడు శంకర్. అతను రెండుమూడు దండయాత్రలు చేసిఉండాలి. ఈ ఆరేళ్లలో పెళ్లిప్రయత్నాలు గూడా అతని తరపున వాళ్ల నాన్న చేసిఉంటాడు.

"తరవాత టైపు నేర్చుకున్నాను.... షార్ట్‌హేండ్ పరీక్షలకి వెళ్లడానికి కొంతకాలం చదివేను.... అదే- ప్రాక్టీసు చేశాను."

శంకర్ చిరునవ్వు నవ్వాడు.

ఆ మాటలకి అతనికి అర్థం తెలుసును. చలపతికి టైపింగ్ అట్టే రాదు- బహుశా టైపురైటరు కీబోర్డు తెలుసును. అందులో కాగితంపెట్టి పదికి ఆరు తప్పులతో నిమిషానికి పదిహేను ఇరవై ప్రాంతాలలో కొట్టగలడన్న మాట.... షార్ట్‌హేండ్ అసలే రాదు. లాంగ్ హేండులోనే అతని స్పీడు ఎక్కువ అన్నమాట.

"ఒకటిరెండు టెంపరరీ ఉద్యోగాలు చేశాను సార్!- వాళ్లు నా పని మెచ్చుకుంటూ సర్టిఫికేట్లు కూడా ఇచ్చేరు!" అంటూ చలపతి తన చేతిలోని బేగ్ జిప్ చర్రున తీసి లోపల చెయ్యిపెట్టాడు.

శంకరం వారించేడు.

ఒకరిద్దరు ఏవో కారణాల వలన అతనికి చిన్నచిన్న ఉద్యోగాలు ఇచ్చే ఉంటారు. వాళ్ల నాన్న తనకి తెలిసిన స్నేహితుడిని పట్టుకుని ఆ స్నేహితుడి బావమరిది తోడల్లుడిద్వారా ఎమ్మెల్యే గారిని ఆశ్రయించి ఉంటాడు. ఒక నెల, రెండునెలలు ఉద్యోగం అయాక ఏ షరతులమీదనైనా సరే చలపతిని వొదిలించుకునే ప్రయత్నంలో వాళ్లు మహభారతంలో కర్ణుడి పరాక్రమాన్నిలాగ చలపతి వైదుష్యాన్నీ, కార్యదీక్షనీ స్వామిభక్తినీ పొగుడుతూ ఒక ప్రశంసాపత్రం రాసి ఇచ్చిఉంటారు. పెళ్లిలో పంచరత్నాల లాగ ఇలాటి కాగితాలని ఎంత వేగంగా మరిచిపోతే అవతలవాడికి అంత మంచిది. శంకరానికి తెలుసును. చలపతికి తెలీదు.

కట్టుకున్న బట్టలు చలపతి ఆర్థిక పరిస్థితినీ, అతని కుటుంబ పరిస్థితినీ సూచిస్తూనే ఉన్నాయి. భార్యకి పుట్టింటివారు పెట్టిన గాజులో అమ్మాయికి వాళ్ల అమ్మమ్మ ఇచ్చిన గొలుసో తాకట్టుపెట్టి ఒక టెరిలిన్ షర్టూ ఒక టెరిలిన్ పాంటూ కొని ఉంటారు. వాటిని ఉద్యోగాన్వేషణ సందర్భాలలోనూ పెళ్లిచూపులకి వెళ్లినప్పుడూ మాత్రమే వాడుకోవాలని షరతు ఎవరూ పెట్టిఉండరు. కాని అది అందరికీ తెలుసు. గాజులో, గొలుసో అమ్మి ఉండరు- తాకట్టే పెట్టి ఉంటారు. "వాడికి ఉద్యోగం వొస్తే మొదటినెల జీతంతో విడిపించేస్తానే! పెళ్లి కుదిరితే అడ్వాన్సులో కట్నం తీసుకుని ముమ్మందుగా ఈ నగ విడిపించుతాను" అని తండ్రి అష్టదిక్పాలకులూ, నవగ్రహాలూ సాక్షిగా ఉన్నంత గంభీరంగా అని ఉంటాడు.

మనిషి బాగానే ఉన్నాడు- నిజానికి, చాలా బాగున్నాడు. కాని, ఆ ముఖంలో వెలుగులేదు అనుకున్నాడు శంకర్. బహుశా ఎప్పుడో ఉన్న చిన్నవెలుగు ఈ నిరుద్యోగపర్వంలో క్రమక్రమంగా మరుగునపడిపోయి ఉంటుంది. ఇంకా ఏమైనా మిగిలితే గులాబిలాటి అమ్మాయిని పెళ్లిచూపుల్లో గాఢంగా ప్రేమించాక వాళ్ల నాన్న "కట్నం ఇవ్వరట! పిల్ల ఎర్రగా బుర్రగా ఉందని అంతే

చాలు పిల్లనివ్వండని అడుగుతామని వాళ్ల ఉద్దేశంలా ఉంది! అందానికేముంది! ఇవాళ ఉంటుంది- నలుగురు బిడ్డల్ని కనేసరికి నాలుగేళ్లకి పోతుంది! బంగారం లాటి పిల్లలు! బంగారం ఒంటిన ఉంటే తప్ప...." అని గుక్కతిప్పుకోకుండా లెక్కించేసరికి కళ్లలో ఆ గులాబీ పిల్ల మెదులుతూఉన్నా నోరు విప్పడానికి అర్హతలేని ఈ చిన్నవయను పెద్దవాడు తన ముఖంలో ఏ వెలుగుని దాచుకో గలడని?

"పెళ్లి అయిందా?" అన్నాడు సిగరెట్ సగంలోనే అష్ట్రేలో పాతిపెడుతూ శంకర్.

"లేదండీ!- ఉద్యోగం వొస్తేగాని..." అని నాన్చాడు చలపతి.

ఉద్యోగం వొస్తేకాని చేసుకోను అని చెప్పబోయి అది మరీ పచ్చిఅబద్ధం అవుతుందని చలపతి ఊరుకున్నాడని గ్రహించడం కష్టమేమీ కాలేదు శంకర్‌కి. ఉద్యోగం వొచ్చేక పెళ్లి ప్రయత్నాలు మళ్లీ చేద్దామని వాళ్లనాన్న దృఢనిర్ణయం తీసుకుని ఉంటాడు. అప్పుడయితే కట్నం బాగా వొస్తుందిగా!

ఇతనితో పెళ్లికాని పిల్ల ఎవరో అదృష్టవంతురాలన్న ఆలోచన శంకర్‌కి వొచ్చింది.

చిరుద్యోగులకి చిల్డ్రన్ ఎక్కువ. నిరుద్యోగులకి మరీ ఎక్కువ. వాళ్లకి వ్యాసంగమూ వినోదమూ విలాసమూ అన్నీ ఆ ఆడదే.... కేలెండరు మారినప్పుడల్లా బిడ్డలుకూడా ప్రాప్తం అవుతూ ఉంటారు.... ఇంట్లో వాసనలు ఏడుపులూ ఉయ్యాలలూ....

శంకర్ ప్రస్తుతంలోకి వొచ్చాడు. ఆ అధ్యాయాలన్నీ తన జీవితంలో చూసినవే. అవి గతం. ఈ మనిషి ఆ గతంలోనించి మరో అలాటిదే గతంలోకి జారుతూ వొస్తున్నాడు. కానీ పెళ్లి కాలేదు. అదృష్టవంతుడు. అయితే, ఈ చలపతికి ఆ మాట తెలీదు. ఆ గులాబీ రంగుబుగ్గల గులాబీ అమ్మాయిని తలుచుకుని మధనపడిపోతూ ఉంటాడు! అది అంత ఫరవాలేదు. ఇలాటి కలలతో ఏ రాత్రి అయినా ఒక అరగంట కన్నా నిద్ర పాడవదు. కొత్త కేలండర్లలాగా పుట్టుకొస్తున్న చంటివాళ్లతో ప్రతిరాత్రీ ప్రతి పగలూ ప్రతి గంటా అశాంతి. నిద్ర పట్టదు. తినడం కూడా కష్టం. జీర్ణం కాదని కాదు- సరుకులు కొనడానికి డబ్బులు లేక.

సుతారంగా తలుపు తట్టి ప్రియంవద లోపలికి వొచ్చింది.

"యస్" అన్నాడు చలపతినించి సంతోషంగా ఆమెవైపు కళ్లుతిప్పి.

"వన్ ఓ క్లాక్‌కి లంచ్ సార్!.... ఎమ్.డీ. బయలుదేరుతున్నారు.... జాపనీస్ డెలిగేషన్...." అంది సగం షార్ట్ హేండ్‌లో ప్రియంవద. ఇంటర్‌కామ్ మీద మాట్లాడాలని ఉండదు ఆమెకి. పని చెయ్యడంలేదని అంటుంది. ఎప్పుడేనా ఆమె కేబిన్‌లోకి వెళ్లి అది నిజమేనేమోనని చూడాలని అనుకుంటూ ఉంటాడు శంకర్. కాని ఎలాగ ఆ పరీక్ష చెయ్యాలో అతనికి తెలియడంలేదు.

జాపనీస్ అని అనడం ప్రియంవదకి తాను నేర్పగలిగినందుకు కొంత గర్వపడ్డాడు శంకర్. జపానీస్ అంటూ ఉండేది. నెలలోనే ఆ మాట సరిగ్గా ఉచ్చరించడం నేర్చుకుంది స్మార్ట్‌గాల్...

చలపతి ముఖం వాడిపోయింది.

గంటలకొద్దీ నిలబడి నిలబడి దర్శనం కోసం కళ్లు కాయలు కాసికాసి చివరికి స్వామివారి సన్నిధి చేరి పరవశంలో కళ్లు మూతపడగానే ముందుకి నెడుతూ భుజం మీద ఛటుడి చెయ్యిపడిన అనుభూతిని చలపతి దాచుకోలేకపోయాడు.

చిరునిరుద్యోగులని ఇంటర్వ్యూ చేసే పనికాదు శంకర్‌ది.

లలిత ఫోన్‌చేసి "అతనితో ఒకసారి మాటలాడండీ! నాన్నగారు మరీ మరీ రాశారు," అని చెప్పడాన్న చలపతికి అతనితో ఇంటర్వ్యూ దొరికింది. లలితకి తండ్రి మాటమీద వీపరీతమైన గురి. శంకర్‌కి లలిత మాటమీద తిరుగులేని గౌరవం.

"ప్రియంవదా! ఇతన్ని ఇంటర్వ్యూ చెయ్యమని నాయర్‌కి చెప్పండి" అన్నాడు శంకర్ లేచినిలబడి పైసవరించుకుంటూ. ఆ మధ్యలో అతను చలపతి ముఖంలోని నిరాశని గమనించేడు. దేవుళ్ల కన్న పూజారులకి గర్వాలూ అసహనమూ నిర్దయా ఎక్కువ అన్నది నిజమేకాదు- చలపతికి తెలుసునన్నమాట.

"సాయంత్రం ఏడున్నరకి వొచ్చి నన్ను ఇంట్లో కలుసుకుని ఏమయిందీ చెప్పండి" అన్నాడు శంకర్. తనను ఈ పరిస్థితిలో లలిత పెట్టిఉండకుండా ఉంటే బాగుండేది. కాని, ఆమె ఏమీచేసినా ఇష్టపడడం ఈ సంవత్సరంలోనూ అలవాటుగానూ తరవాత సరదాగానూ మారిపోయింది.

పోయిన ప్రాణం వొచ్చినట్టు అయింది చలపతికి.

"అలాగే సార్! థేంక్స్ సార్! నన్ను 'నువ్వు' అనండిసార్! సాయంత్రం మీ దర్శనం చేసుకుంటాను సార్!" అన్నాడు మెలికలు తిరిగిపోతూ వెనక్కి తిరగకుండానే వెనక్కివెడుతూ. ఆ ద్వారము స్ప్రింగ్‌తలుపులూ అతనికి తగుల్తాయని అనుకుని శంకర్ పై సర్దుకుంటూనూ, జాకెట్ సరిచేసుకుంటూనూ గమనించాడు, కాని చలపతి మిరకిల్‌లాగ ఎలాగో బయటపడ్డాడు. అతను కాని, తలుపులు కాని, ద్వారంకాని దెబ్బతినలేదు.

ఏదైనా కంపెనీలో కారుమీద వొచ్చేవాడితో ఇంటర్వ్యూ అయితే చాలు- ఉద్యోగం వొచ్చేసిందనే అనుకుంటారు ఈ ఫూల్సు అని బాధగా అనుకున్నాడు, ఉద్యోగం అంటే డబ్బు- కొత్త చీరెలు.



సినిమాలు, బహుమతులు, మంచి పెళ్ళి సంబంధాలకు. అంటే ఎక్కువ కట్నం ఇంకా ఎక్కువ కానుకలూ అంతకన్నా మరీ ఎక్కువ లాంఛనాలూనూ. సినిమాలో హీరో హీరోయిన్ డ్రీమ్ సీక్వెన్స్‌లాగ. అందులో ఎంత నిజముందో ఇందులోనూ అంతే నిజముందని పాపం వీళ్ళకి అనిపించదు. అనిపిస్తే నిరుద్యోగులూ నికృష్ట జీవనులూ నిలిచిఉండరు మరి. చచ్చిపోతారు. లేదా చంపేస్తారు.

యాంత్రికంగా వెళ్లి కారులో కూర్చున్నాడు శంకర్.

లలిత ఈ పూర్ కేస్ ఎందుకని రికమెండ్ చేసింది?

వాళ్ల నాయన చెప్పేరు కనక.

అయన ఎందుకు చెప్పేరూ?

ఏమో! సంసారంలో సన్యాసి ఆయన. ఏమీ అక్కర్లేదు. లలిత పెళ్లికి వొచ్చిన సంబంధాలన్నీ వాళ్ల చిననాయన తెచ్చినవేనట. అమెతండ్రి ఉదయం సాయంత్రం వెళ్ళి ఆలయంలో కూర్చుని ధ్యానంచేస్తూ ఉండేవాడట. ఈ ప్రవర్తనకి వొళ్లుమండి ఆయనభార్య ఒకరాత్రి "ఈ పూట వంట చెయ్యలేదండీ!" అందిట.

"అలాగా!" అని మాత్రం అని వెళ్లి కుండలో నీరు మరచెంబునిండా నింపి గడగడా తాగివెళ్లి చాపమీద పడుకున్నాడుట ఆయన. రెండుమూడు నిమిషాల తరవాతచూస్తే ఆయన గాఢనిద్రలో ఉన్నాడట. చావుబతుకుల సమస్యలో తప్ప నిద్రించే మనిషిని లేపకూడదన్నది ఆయన సూత్రంట. అంచాత ఆయనని లేపి వొండిఉంచిన అన్నంపెట్టే ధైర్యం ఆ ఇల్లాలికి లేకపోయింది. ఇంటిమాట పట్టించుకోడనీ, ఎదిగిన పిల్లకి సంబంధాలైనా సరిచేసేపాటి శ్రమా పూచీకూడా ఆయన పరిత్యజించాడనీ కోపంతో కన్నీళ్ళతో లలితతో ఆ సాయంత్రమంతా ఫిర్యాదుచేసిన ఆ ఇల్లాలికి ఆ మనిషి నిద్రచూసి మళ్లీ కన్నీరు వొచ్చిందిట.

చివరికి ఆ రోజున నరసింహస్వామి ఉగ్రరూపంలో ఉండగా ప్రహ్లాదుడిని ఆయన ముందుకి పంపినట్టు లలితని పంపిందట తల్లి.

లలిత నాలుగైదుసార్లు లేపేక ఆయన కూర్చుని, "ఏమిటి తల్లీ? ఆకలిగా ఉందా అమ్మా? ఆ మాటే నాకు మనసులోకి

రాలేదు. ఇప్పుడే వెళ్లి వొంటకి ఏమైనా తెస్తాను" అన్నాడట లేచి నిలబడుతూ.

"మా అమ్మకి దుఃఖం ఆగలేదండీ! జీతం రాగానే పూర్తిగా తెచ్చి నాన్న వంటింటి గుమ్మంమీద పెట్టేవాడు. ఎప్పుడైనా పదీ అయిదూ ఎందుకేనా వొస్తే అవీ అలాగే తెచ్చి తమలపాకులతోసహా అక్కడే పెట్టేసేవారు. అమ్మ ఆ డబ్బుతో సంసారం గౌరవంగా సాగించేది. అప్పుకి వెళ్లడం అనేది నాన్నకి తెలీదు. అంత కన్న ఆత్మహత్య ఆయన సుఖంగా చేసుకుంటారని నాకు తెలుసును. కాని ఆరాత్రి ఆయన అలా అనేటప్పటికి అమ్మకీ నాకూ కూడా దుఃఖం ఆగింది కాదు...." అని చెప్తూ ఉంటుంది లలిత.

"మీ కెందుకమ్మా బాధ! అప్పుకివెడతానని! వెళ్లను. మా తాతకి మహారాజా వారు తొడిగిన సింహతలాటంమీద ఇన్నాళ్లూ మూర్ఖంగా ఒక అనుబంధం పెంచుకున్నాను. మా తాతగారు ఎప్పుడో పోయారు. ఆ మహారాజూ పోయారు. ఆ రాజ్యమూపోయింది. అది అమ్మేస్తాను గాని, మీకు తలవొంపులు తెచ్చే హీనప్పని జేస్తానటమ్మా!" అని అయన లలితనీ భార్యనీ ఓదార్చారుట.

చివరికి ఉన్నసంగతి భార్యనించి విని ఆయన నవ్వి, "అంతేనా! అయితే ఫరవాలేదు. ఈసరికి ఏకాదశి వొచ్చిఉండాలి... మీరు తిని పడుకోండి. నేను రేపు సాయంత్రం ఫలహారం చేస్తాను" అని నిర్వికారంగా అని, "తల్లీ! రేపటినించి నువ్వు చీకటిపడగానే తిను, అమ్మకి. పెళ్లి అయాక నీకూ ఎలాగా తప్పదు ఎదురుచూడడం. ఇప్పటినించీ వొద్దు" అని మాత్రం అని ఆయన మళ్లీ చాపమీద పడుకుని నిమిషంలో నిద్రపోయాడట. ఆ రాత్రి లలిత భోజనం చెయ్యక తప్పలేదు_ ఆయన చెప్పేడుగా! "ఎలాగ తినగలిగానో అది ఎలాగ ఇమిడిందో తెలీదండీ!" అంటుంది లలిత. ఆ రాత్రి జ్ఞాపకం వొచ్చినప్పుడల్లా ఆమె కళ్ళలో నీరు నిలుస్తూనే ఉంటుంది.

ఆయన రాశారు ఉత్తరం.

కార్లో వెనక్కి జారబడి కళ్లుమూసుకుని నవ్వుకున్నాడు శంకర్.

"ఆడపిల్ల వాళ్ళయింటికి వెళ్ళి పిల్ల నడుగుతాముట్రా!" అంది అమ్మ.

"ఏం తప్పేమిటి?" అన్నాడు శంకర్.

"కట్నాలు వొద్దన్నావు_ సరే అన్నాం. అమెరికా వెళ్ళి చదివివొచ్చావు. నీకేం తక్కువ? వొక్కగా నొక్క కొడుకువి. గౌరవానికైనా జరగొద్దుట్రా?" అన్నాడు మామయ్య. అతని కూతురిని చేసుకోలేదని అతనికి కోపం. అసలు అమెరికా వెళ్లడం అతనికిష్టంలేదు. "అక్కడ ఏ దొరసానినో కట్టుకొనివొచ్చి కులమంతా భ్రష్టంచేస్తాడే వీడు" అన్నాడు మామయ్య అప్పుడు. చీకటి పడగానే ఆయన ఎక్కడికివెడతాడో ఏ పరిస్థితుల్లో ఇంటికి తిరిగివస్తాడో ఆ చిన్నఊరిలో అందరికీ తెలుసును.

"ఆ అమ్మాయి నాకు నచ్చింది. మీకు తలవొంపులయితే మీరు వెళ్ళొద్దు_ నేను వెడతాను" అని శంకర్ అంతపనీచేశాడు.

గౌరవంగా ఆయనకి తనని తాను పరిచయం చేసుకుని తాను వొచ్చినపని చెప్పేడు శంకర్.

"మీ తండ్రిగారు నాకు తెలుసును _ మంచిమనిషి" అన్నారాయన.

ఆ తరవాత శంకర్‌కి తెలిసింది అందరినీ ఆయన అలాగే గుర్తిస్తారని.

"మీరేం చేస్తున్నారు?" అన్నారాయన. ఆ సమయంలో గుడిలో ఎవరూ లేరు_ ఆయన ఆ రాత్రి ఆ రాతిస్తంభానికి ఆనుకుని కూర్చున్నారు.

"డిగ్రీ తీసుకున్నాను. ఏదో ఒక ఉద్యోగం రాకపోదు" అన్నాడు శంకర్. అప్పటికి చేతిలో రెండు ఉద్యోగాలు ఉన్నాయి. తాను చదివిన చదువూ తనకి వొచ్చిన ఆఫర్లూ ఆయనకి చెప్పాలనిపించలేదు. ఆయనదగ్గర తాను చదువుకోలేదు. కాని ఆ బడిపంతులుమీద ఎక్కడలేని గౌరవమూ కలిగింది. తన ఆస్తే చదువూ బంగారు భవిష్యత్తూ గురించి ఆయనకి చెప్పడం తనకే ఏదో అవమానంలాగ అనిపించింది.

"లలిత_ మా అమ్మాయి మీ కెలాగ తెలుసును?" అని అడిగారాయన.

"మా చెల్లెలూ ఆవిడా కలిసి చదువుకున్నారు...ఒకటి రెండుసార్లు చూశాను" అన్నాడు శంకర్, ఆ మాట ఆయన నమ్మరేమోనని భయపడుతూనే. కాని ఉన్న నిజం అదే. పెళ్ళి అయి అత్తవారింటికి వెళ్ళిపోయినా పద్మ లలితనిగురించి తనకి చెప్పడమూ ప్రతీ ఉత్తరంలోనూ రాయడమూ మానలేదు. తనమీద పద్మకి ఎంత అభిమానమో అతనికి తెలుసును. అదీకాక లలిత తనకి నచ్చింది. మంచిది అని తనకి అనిపించిన పనిచెయ్యడంలో ఏ అవరోధాలూ భరించడం అతనికి అలవాటులేదు.

"మీవాళ్లు వొప్పుకోకపోవచ్చును.... కట్నం తేగలిగేశక్తి లేదు దానికి" అన్నారాయన దూరంగా చూస్తూ ఆలోచిస్తూ.

"అలాటి అవసరాలు నాకు లేవు" అన్నాడు శంకర్.

"కాని మీరు ఒక కుటుంబంలో వ్యక్తి కదా!....అదీకాక అమ్మాయికి వొచ్చిన సంబంధాలన్నీ తప్పిపోయాయి.... కారణాలు ఉన్నవి ఉన్నట్టు చెప్పడం అవతలివాళ్ళకి ఇబ్బందిగా ఉంటుంది...." అని ఆయన ఆగేడు.

"అవన్నీ ఆలోచించేను. మీరు అనుమతి ఇస్తే...." అన్నాడు శంకర్.

"లలిత ఏమంటుంది?" అన్నారాయన.

"ఈ విషయం ఆమెకి తెలీదు. మీరు అడిగి చెప్పాలి" అన్నాడు శంకర్.

ఆ గుడిలోనే పెళ్ళి అయింది. అమ్మా నాన్నాకూడా రామన్నారు. కాని సరిగ్గా ముహూర్తంకి వొచ్చి అక్షతలువేసి

వెంటనే వెళ్లిపోయారు. ఆ సాయంత్రమే బయలుదేరి వొచ్చేశాడు శంకర్.

లలితలో ఏమిటి కావాలని ఆశపడాలో అతనికి ఎప్పుడూ తెలియలేదు. కాని ఆమె తనకి అన్నీ, అంతాను. వేరే ఆలోచనలకీ ఆశలకీ అవకాశము ఉండేది కాదు.


పెళ్ళి అయాక లలిత ప్రతి మూడు నెలలకీ ఒకరోజు మాత్రం ఇంటికి వెళ్ళి వొచ్చేది. అదీ శంకర్ బయటిఊళ్ళు వెళ్ళినప్పుడు. అంతే. ఆమెలోని అనురాగం ఆప్యాయతల మధ్య ఆ తండ్రిగారి స్థైర్యమూ శాంతీకూడా ఉండీ ఉండీ కనిపిస్తూ ఉంటాయి. అలిసిపోయినా ఏ విషయం గురించి అయినా బాధపడినా ఆమె ప్రశాంతంగా చిరునవ్వుతో అతని మనసుని అమావాశ్యనించి పున్నమికి ప్రయాణం చేయిస్తుంది. ఆ సమయంలో పసివాడిని వేలు పట్టుకుని నడిపిస్తూన్న తల్లిలాగ ఉంటుంది. అశాంతీ అసౌందర్యమూ అన్నీ అతనికి దూరం అవుతాయి....

కారు ఆగింది. కళ్లు తెరిచి శంకర్ కారుదిగి హోటల్లోకి వెళ్లిపోయాడు. అరున్నరదాకా వ్యాపార చర్చలూ పథకాలూ బేరాలూ వాగ్దానాలూ.... తల నొప్పిగా ఉంది. డ్రింక్స్‌కీ డిన్నర్‌కీ ఉండమని వాళ్లెంత బలవంతంచేసినా అంగీకరించకుండా శంకర్ ఇంటికి వెళ్లిపోయాడు.

వెళ్లి స్నానంచేసి బట్టలు మార్చుకుని అతను లాన్‌లో కూర్చున్నాడు. ఈ సమయం లలిత టీ తెచ్చిఇచ్చి తనతో కబుర్లుచెప్పే సమయం.

"నమస్కారం సార్!" అంటూ చలపతి రావడమూ లలిత టీ ట్రేతో రావడమూ ఒక్కసారే జరిగాయి. "నమస్కారం మేడమ్" అంటూ చలపతి చేతులు కట్టుకుని నిలబడ్డాడు.

ఆయన అరగంటనించీ మీకోసం




ఎదురుచూస్తూ నిలబడ్డారు—" అంది లలిత చలపతిని కూర్చోమంటూ.

ఆమె కూర్చున్నాక ఇబ్బందిగా పొద్దుటిలాగే కుర్చీ అంచుకి కూర్చుని, "మీరు రమ్మన్నారు సార్!... పొద్దుట నా వివరాలన్నీ వాళ్లు రాసుకున్నారు. మీరు ఒక మాట — ఒక్కమాట అంటే అయిపోతుంది సార్!" అని రెండు మూడుసార్లు అన్నాడు చలపతి.

శంకర్‌కి కోపం వొచ్చేసింది.

లలిత లేచి దూరంగా నిలబడ్డ సర్వెంటుని పిలిచి "అయ్యగారిని హాల్లో కూర్చోపెట్టు.... టీ ఇయ్యి" అని చెప్పి, తాను వెళ్ళి శంకర్ దగ్గర కూర్చుని, "సారీ! పొరపాటు చేశాను.... టీ తాగండి. ఆ తరువాత మీరు అనాల్సినది నన్ను అనవొచ్చును" అంది రెండు కప్పుల్లో టీ కలుపుతూ.

అతనేదో అనబోయాడు. లలిత వారించి టీ ఇచ్చి తానూ తీసుకుంది.

టీ తాగి, "ఎవరు లలితా ఈ మనిషి?" అన్నాడు శంకర్.

టీ సరంజామా అంతా ఖాళీచేయించే దాకా ఏమీ అనలేదు లలిత. సర్వెంటు వెళ్లాక అతనికి ఎదురుగా కూర్చుని, "నాన్నగారు పంపేరని చెప్పేనుగా! ఈ చలపతిగారి సంబంధం మన పెళ్ళికి ఆరునెలల ముందు మా చిన్నాన్న తెచ్చేడు.... మిగిలినది మామూలు కథే!" అంది లలిత.

"ఏడున్నరకి రమ్మన్నాను.... ఏడు కాలేదింకా" అన్నాడు శంకర్.

"అతను ఆరుకే వొచ్చాడు" అంది లలిత.

శంకర్‌కి అర్థమైంది.

"సారీ...." అన్నాడు. చలపతి ఆమెని ఇబ్బందిలో పెట్టేడన్నమాట. ఇంటికి ఎవరు వొచ్చినా స్వయంగా వాళ్లకి మర్యాదలుచేసే మనిషి లలిత— ఈ మనిషిని పంపినది మామగారు కనక ఆమె మరి కొంచెం శ్రమపడి ఉంటుంది.

"అక్కర్లేదులెండి! కాని...."

టెలిఫోను వొచ్చింది. శంకర్ మాట్లాడి పెట్టేసి, "నాయర్— ఈ ఎక్స్‌పరుడికి ఏమీ రాదని అతి సుళువుగా తేలిపోయిందిట— అదే— చాలా మర్యాదగా చెప్పేడనుకో! కాని, సారాంశం...." అన్నాడు శంకర్.

"ఏదైనా పని ఇమ్మన్నారు— వీలైతే. అంతేకాని తప్పదని నాన్నగారు రాయలేదు కదా! ఆయనకి నేను రాస్తాను. అర్థంచేసుకుంటారు. మీరా మాట మరిచిపొండి" అంది లలిత.

శంకర్ ఆలోచనలో పడ్డాడు.

ఆమె చెప్పినది బాగానే ఉంది.

కాని, ఆమెకీ తనకీ కూడా ఇది కష్టంకలిగించే పరీక్ష. ముఖ్యంగా, లలితకి. ఎలాటి పరిస్థితుల్లో మామగారు ఆ ఉత్తరం రాశారో తెలీదు కాని అవి అసామాన్యమైనవని తెలుస్తూనే ఉంది. లలిత మాట విని ఏమీ చెయ్యకపోతే ఇద్దరూ ఓడిపోయినట్టే....

"ఎందు కింక ఆ విషయంలో ఆలోచన? అతన్ని పిలిచి చెప్పెయ్యండి, మీరు కావాలంటే నేను చెప్తాను. మీరు మనస్సు పాడుచేసుకోవాల్సినంత విషయమేదీ కాదిది" అంది లలిత.

నిజమే.

కాని.... అంత సింపుల్ కాదు.

"ఒకమాట మరచిపోతున్నావు - నాకొక ఉపకారం చేసిన మనిషి చలపతి" అన్నాడు శంకర్ చిరునవ్వుతో.

"మీకా? అదేమిటి?" అంది లలిత.

"నిన్ను కాదనడం-అదే. పెళ్లికి..." అన్నాడు శంకర్.

లలిత నవ్వి, "అది నాకూ ఉపకారమే. కాని, దీనికి వాళ్ల వాళ్లని మెచ్చుకోవాలి; ఇతన్ని కాదు కదా?" అంది.

"ఉపకారం జరిగేదీ వాళ్లకేగా!" అన్నాడు శంకర్. కాని లలిత అంత త్వరగా అంత తర్కంతో సమాధానం చెప్పడం అతనికీ ఆశ్చర్యం కలిగించింది.

పరీక్షగా చూశాడు లలితని.

లలిత చిరునవ్వు అందంగా ఉంది.

ఆసంధ్యా కాలంలో వెన్నెలని పిలుస్తున్నట్టు ఉంది.

రెండు నిముషాలు అతను తీవ్రంగా ఆలోచించాడు. అర్హత లేనివాడికి ఉద్యోగం ఇవ్వడమా? లేక సూత్రానికి కట్టుబడి కాదని, తనకి ప్రియమైన ఇద్దరిని బాధపెట్టడమా?

లలితకి చలపతిమీద నిజంగానే కోపమూ ద్వేషమూ లేదా? ఉంటే బాగుండును అనిపించింది శంకర్‌కి. కాని అ తండ్రిపోలికలే ఆమెవి.

శంకర్ ఫోన్‌తీసి నాయర్‌ని పిలిచి, మళ్లీ మాట్లాడేడు. రెండునిమిషాల తరవాత లలితవైపు తిరిగి, "అతన్ని మా అస్సాం ఫేక్టరీలో అసిస్టెంటు స్టోర్‌కీపరుగా వెయ్యమన్నాను" అన్నాడు.

"మంచిది. నాన్నగారు సంతోషిస్తారు" అంది లలిత నిర్వికారంగా.

"చలపతి సంతోషిస్తాడా, అని...."

"పిలిపించమంటారా?" అని అతని అంగీకారం చూసి దూరాన నిలబడిఉన్న సర్వెంటుని పిలిచి చలపతికి కబురు పెట్టింది.

చలపతి ఆత్రంగా వొచ్చాడు.

"కూర్చోండి" అన్నాడు శంకర్ మృదువుగా.

"నన్ను మన్నించకండి సార్!...." నిలబడే అన్నాడు చలపతి.

"ఫరవాలేదు."

"వొద్దుసార్! మన్నించండి...."

"సరే....మీ ఉద్యోగం మాట-"

చలపతి నమస్కారాలు వరసన చేశాడు.

"అస్సాంలో గౌహతీ పక్కన మా ఫేక్టరీఉంది. అక్కడ వేస్తారు మిమ్మల్ని. పని బాగాఉంటే సంవత్సరం తరవాత పర్మనెంటు చేస్తారు-" అన్నాడు శంకర్.

"అస్సామా?" అన్నాడు చలపతి నీరసంగా.

"అవును.... ఈ ప్రదేశాల్లో మీకు తగ్గినదేదీ లేదు."

"కొంచెం దగ్గిరగా ఏదైనా లేదా సార్? క్లర్కు అయినా ఫరవాలేదు. నాకు టైపు, షార్టుహేండూ తెలుసును."

"నాకు రోనాల్డ్‌రీగన్ కూడా తెలుసును" అని స్వగతంలో అనుకోబోయి బయటికి అనేశాడు శంకర్.

చలపతి "అదెవరు సార్?" అన్నాడు.

"ఎవరైతేనేం....మీరు రేపు నాయర్ దగ్గరకి వెడితే ఫామ్ ఇస్తాడు. ఫిల్‌చేసి ఇవ్వండి...." అన్నాడు శంకర్.

కొంచెం ఆగి, "మావాళ్లని అడిగి..." అన్నాడు చలపతి.

"పోనీ. అలాగే చెయ్యండి. కాని ఒక వారంలో ఏదో ఒక నిర్ణయానికి రండి. ఆ ఉద్యోగంకోసం చాలామంది కాసుకుని ఉన్నారు" అన్నాడు శంకర్.

"సరే సార్! వెళ్లివొస్తానండీ!" అన్నాడు చలపతి.

"మంచిది. మీవాళ్లు ఒప్పుకుంటే నాయర్‌ని కలవండి.... మీ పెద్దవాళ్లకి నేనూ మా లలితా నమస్కారాలు చెప్పేమని చెప్పండి" అన్నాడు శంకర్.

లలితకి కూడా నమస్కారం చెప్పి చలపతి వెళ్ళిపోయాడు. లలిత చాలా తీవ్రమైన ఆలోచనలో ఉంది అది గమనించలేదు.

కొంచెం ఆగి, "గాలి లేదు. లోపలికి పోదామా?" అన్నాడు శంకర్.

"పదండి" అంది లలిత.

మేడమీద గదిలో లలిత ఏ. సీ. పెడుతూంటే శంకర్ డ్రెసింగ్ టేబిల్‌ముందు నిలబడి అందులో కనిపిస్తూన్న మనిషిని చూశారు.

ఆ మనిషి నల్లగా, కొంచెం లావుగా, సుమారుగా వికృతంగా ఉన్నాడు. కొంచెం పొట్టి కూడాను. అతనికి ఉన్నది లోపల లోపవే కాని....

"ఏమిటండీ ఆలోచన?" అంది లలిత.

ఆమెని పరీక్షగా చూశాడు శంకర్. చక్కటి మనిషి లలిత.

"ఏమిటండీ!" అంది లలిత మళ్లీ. ఈసారి అతనికి దగ్గరగా వొచ్చింది.

ఆమెని చేతుల్లోకి తీసుకుని, "దేవుడు సోషలిస్టు! అందుకే దీపావళి చీకటి రాత్రితో వొస్తుంది" అన్నాడు శంకర్.

లలిత చేతులు అతని మెడచుట్టూ పూలతీగల్లాగ సుతారంగా బిగుసుకున్నాయి. వాళ్ల మధ్యనించి ఒక నిట్టూర్పు బయటికి తప్పుకుంది.

———